GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 6 | సంచిక : 281 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | శుక్రవారం 31-05-2024 | పేజీలు : 3

## చుక్కా రామయ్య ఇంటికి సీఎం రేవంత్ రెడ్డి





**టీ మీడియా, మే 30,హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనలో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. అనూహ్యంగా మాజీ ఎమ్మెల్సీ, ప్రముఖ విద్యావేత్త చుక్కారామయ్య ఇంటికి వెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించుకున్నారు. చుక్కా రామయ్య ఆరోగ్యం క్షీణించిందనే సమాచారం మేరకు పరామర్శించేందుకు వెళ్లడానికి సీఎం నిర్ణయించుకున్నారు. రాష్ట్ర అధికారిక చిహ్నం వివాదం కావడంతో ప్రస్తుతం సచివాలయంలో అఖిలపక్షం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో దాదాపు 45 మంది ప్రముఖులు పాల్గొననున్నారు. ఈ సమావేశం తర్వాత రామయ్య ఇంటికి వెళ్లనున్నారు. అఖిలపక్షం నేపథ్యంలో ఇప్పటికే వివిధ పార్టీల నేతలు, జేఏసీ నేతలు, ఉద్యమకారులు సచివాలయానికి చేరుకున్నారు.

## తెలంగాణ రాజముద్ర ఆవిష్కరణ వాయిదా

### -కొత్త చిహ్నంపై ఇంకా సంప్రదింపులు



**టి.మీడియా, మే30,హైదరాబాద్:**తెలంగాణ చిహ్నం ఆవిష్కరణ కార్యక్రమం వాయిదా పడింది. జూన్ 2నఆవిష్కరించాల్సిన ఈ లోగోను వాయిదా వేస్తున్నట్లు తెలిపాయి సీఎంవో వర్గాలు. కొత్త చిహ్నంపై ఇంకా సంప్రదింపులు కొనసాగుతున్నాయని అందుకే దీనిని వాయిదా వేస్తున్నట్లు స్పష్టత ఇచ్చింది. జూన్ 2న జయ జయయే తెలంగాణ అనే గేయం మాత్రమే ఆవిష్కరణ చేయనున్నట్లు మీడియాకు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర చిహ్నంతోపాటు తెలంగాణ తల్లి మార్పు పై ఇంకా పలువురితో ప్రభుత్వం సంప్రదింపులు, చర్చలు జరుపనున్నట్లు సమాచారం. దీనిపై పూర్తి స్థాయిలో అందరి ఆమోదం పొందిన తరువాతే తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. తెలంగాణ ఏర్పాటై దాదాపు దశాబ్దం గడుస్తున్న తరుణంలో కాంగ్రెస్ సర్కార్ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ జూన్ 2న జరిగే దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని భావిస్తోంది. ఇందుకు తగిన ఏర్పాట్లను కూడా సీఎస్ శాంత కుమారి పరిశీలిస్తున్నారు. ఇదిలా ఉంటే తెలంగాణ రాజముద్రలో మార్పులపై బీఆర్ఎస్ పార్టీ ఫైర్ అవుతోంది. అందులో చారిత్రాత్మక కట్టడమైన చార్మినార్?ను, కాకతీయుల కళా వైభవాన్ని గుర్తు చేసే శిలాతోరణాన్ని తొలగించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. మిత్రపక్షాలతో ఈరోజు సీఎం రేవంత్ కీలక సమావేశం కానున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వివరించనున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశానికి కేవలం వామపక్షాలు, ఎంఐఎంను మాత్రమే ఆహ్వానించినట్లు తెలుస్తోంది. భేటీకి బీఆర్ఎస్, బీజేపీని ఆహ్వానించకపోవడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ రాజముద్రను ఇవాళ ఫైనల్ చేసే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్ర చిహ్నంపై ఇప్పటికే చిత్రకారుడు రుద్ర రాజేశం 50 నమూనాలు సీఎం రేవంత్ రెడ్డికి చూపించారు. అమరుల త్యాగాలు ప్రతిబింబించేలా లోగో ఉండే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటివరకున్న అధికారిక చిహ్నంలో మార్పులుచేర్పులు చేయిస్తుంది కాంగ్రెస్ సర్కార్. రాచరికపు ఆనవాళ్లు ఉండొద్దని ఆదేశించడంతో.. పలు నమునాలను ప్రభుత్వం ముందుంచారు చిత్రకారుడు రుద్ర రాజేశం. అయితే, ఈ నమూనాల్లో కాకతీయ తోరణం సహా ఇతర చిత్రాలు లేకపోవడంపై రచ్చ నడుస్తోంది. మరోవైపు, రాష్ట్ర గీతాన్ని ఆంధ్రాకు చెందిన కీరవాణితో కంపోజ్ చేయించడంపైనా రగడ జరుగుతోంది.

## మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్న

### -ఎక్స్ వేదికగా స్పందించిన సీఎం జగన్




**టి.మీడియా, మే30అమరావతి బ్యూరో:**ఏపీలో అధికారంపై సీఎం వైఎస్ జగన్ మరోసారి స్పందించారు. తన ఎక్స్ వేదికగా మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు స్పష్టం చేశారు. ప్రజల ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సరిగ్గా నేటితో సరిగ్గా ఐదేళు అని గత అనుభవాలను గుర్తు చేశారు. ప్రస్తుతం కుటుంబ సభ్యులతో కలిసి ఫారిన్ వెకేషన్ లో ఉన్న సీఎం జగన్ జూన్ 1న ఇండియాకు తిరిగిరానున్నారు. అయితే గతంలో తన ఫారిన్ టూర్ కు వెళ్లే ఒక రోజు ముందు ఏపీలో ప్రభుత్వం ఏర్పాటుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఐప్యాక్ టీంకు అభినందనలు తెలిపేందుకు వెళ్లిన సీఎం జగన్ తాము ఈసారి 23 పార్లమెంట్ స్థానాలు గెలవబోతున్నామన్నారు. ఈసారి ఏపీ ఫలితాలు చూసి దేశం నివ్వెరపోతుంది అని ధీమా వ్యక్తం చేశారు. ఈ మాటలతో వైఎస్ఆర్సీపీ కార్యకర్తల్లో ఎనలేని జోష్ కనిపించింది. ఇక పార్టీ శ్రేణులు కూడా అంతే ఉత్సాహంతో ఉన్నారు. జూన్ 4న ఫలితాలు విడుదల అయితే.. జూన్ 9న విశాఖ వేదికగా ఉదయం 9.38 నిమిషాలకు ప్రమాణ స్వీకార మహోత్సవం అటూ వైఎస్ఆర్సీపీ అధికారిక వెబ్ సైట్లో సందేశాన్నిపోస్ట్ చేశారు. దీంతో పార్టీ నాయకుల్లో సైతం గెలుపుపై ధీమా కనిపిస్తోంది. మరోసారి వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం ఏర్పాటు కానుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే తాజాగా తన ట్విట్టర్ వేదికగా స్పందించిన సీఎం జగన్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. దేవుడి దయ, ప్రజలిచ్చిన చారిత్రాత్మక తీర్పుతో సరిగ్గా ఐదేళ్ల క్రితం ఇదే రోజున వైఎస్ఆర్సీపీ అధికారంలోకి వచ్చిందన్నారు. కులం, మతం, ప్రాంతం, రాజకీయాలు చూడకుండా ప్రతి కుటుంబానికీ మంచి చేసిందని తెలిపారు. ప్రజలందరి దీవెనలతో మళ్లీ ఏర్పాటుకానున్న ఈ ప్రభుత్వం ఇదే మంచిని కొనసాగిస్తూ రాష్ట్ర సమగ్రాభివృద్ధి దిశగా మరిన్ని అడుగులు ముందుకు వేస్తుందని స్పష్టం చేశారు. దీంతో వైఎస్ జగన్ రెండో సారి అధికారంలో వస్తారన్న ధీమా చాలా మందిలో కనిపిస్తోంది. ఇప్పటికే విశాఖపట్నంలో అన్ని హొటళ్లు, రూములు, బస్సు, ట్రైన్, ఫ్లైట్ టికెట్స్ సైతం బుక్ అయిపోయాయి. కేవలం 7,8,9 తేదీలల్లో మాత్రమే బుకింగ్ ఫుల్ అయినట్లు తెలుస్తోంది. అయితే ఇవన్నీ ఎలా ఉన్నా జూన్ 4న ఫలితాలు వెల్లడికానున్నాయి. అప్పుడే అధికారికంగా ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంది అంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

## యువత, నిరక్ష్యరాస్యులను టార్గెట్‌గా బెట్టింగ్ దందా..

### -దీని వెనుక ఉన్నది ఓ ఎస్సై కుమారుడు

**టి.మీడియా, మే30,జోగులాంబ గద్వాల్:** జిల్లాల్లో క్రికెట్ బెట్టింగ్ కలకలం రేపుతోంది. ఇటివల ఆన్లైన్లో బెట్టింగ్ పాల్పడుతూ పోలీసులకు చిక్కిన గ్యాంగ్ తీగ లాగితే మొత్తం బెట్టింగ్ రాకెట్ డొంక కదులుతున్నది. గ్రామీణ ప్రాంతంలోని యువత, నిరక్ష్యరాస్యులను లక్ష్యంగా చేసుకొని నగదు, భూమి, వాహనాలు, బంగారు అభరణాలు దోచుకుంటున్నారు. ఈ క్రికెట్ బెట్టింగ్ దందాలో ఓ ఎస్సై కుమారుడు వ్యవహారం హాట్ టాపిక్?గా మారడంతో జిల్లా ఎస్పీ ప్రత్యేక దర్యాప్తు చేయిస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని నడిగడ్డలో క్రికెట్ మ్యాచ్ బెట్టింగ్ యథేచ్ఛగా సాగుతోంది. ఆన్ లైన్ లింక్?లు, వాట్సాప్ గ్రూప్?ల్లో మెసేజ్?ల ద్వారా లింక్?లు పంపి బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. ఇటివలే జోగులాంబ గద్వాల్ జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులు నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా మొత్తం బెట్టింగ్ మాటున జరుగుతున్న అసలు దందా బట్టబయలు అయింది. బెట్టింగ్ డబ్బుల కోసం భూములు, వాహనాలు, బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టించుకోవడం, అనంతరం వాటిని సొంతం చేసుకునే వ్యవహారం జిల్లాలో సంచలనంగా మారింది. ఇటివలే ముగిసిన ఐపీఎల్ మ్యాచ్?ల ప్రారంభం నుంచి ఈ దందా జోరుగా సాగిందని పోలీసుల విచారణలో తేలింది. బెట్టింగ్ నిర్వాహణకు ప్రత్యేకంగా ఓ వెబ్ సైట్ క్రియెట్ చేశారు. లాగిన్ వివరాలు ప్రత్యేకంగా లింక్?ల ద్వారా పంపి నగదు డిపాజిట్ చేయడం, బెట్టింగ్?లు పెట్టడం నిర్వహిస్తున్నారు. ఇక నిరక్షరాస్యుల కోసం ప్రత్యేకంగా వ్యక్తులను ఏర్పాటు చేసుకొని వారి ద్వారా నగదు తీసుకొని బెట్టింగ్ కోసం వెబ్ సైట్?లో మనీ డిపాజిట్ చేయిస్తున్నారు. ఇక కొంత మంది బెట్టింగ్ రాయుళ్ల దగ్గర డబ్బు లేకుంటే వారికి అప్పుల రూపంలో అరెంజ్ చేస్తున్నారు ఈ కేటుగాళ్లు. ఈ అప్పుల వ్యవహారంలో జోగులాంబ గద్వాల్ జిల్లాకు చెందిన ఓ ఎస్సై కుమారుడు కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అమాయకుల వద్ద నుండి భూములు, కార్లు, బైక్?లు, బంగారు ఆభరణాలు కుదువపెట్టుకొని బెట్టింగ్?ల కోసం వడ్డీలకు నగదు అందజేస్తున్నట్లు తెలిసింది. అంతేకాకుండా ఆ ఎస్సై కూడా పలు ఆరోపణలతో ప్రస్తుతం ఎస్పీ ఆఫీసుకు అటాచ్ చేసినట్లు టాక్ నడుస్తోంది. వీరి పాత్రతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు ఇందులో భాగస్వామిగా ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.




బెట్టింగ్ దందాపై లోతైన దర్యాప్తు: జిల్లా ఎస్పీ రితిరాజ్

ఇక బెట్టింగ్ దందాపై ప్రత్యేక బృందంతో లోతైన దర్యాప్తు చేయిస్తున్నారు జిల్లా ఎస్పీ రితిరాజ్. ఈ వ్యవహారంలో ఎంతటి వారున్నా చర్యలు తప్పవంటూ ఆమె హెచ్చరిస్తున్నారు. గద్వాల్ టౌన్ పోలీస్ స్టేషన్?లో కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నారు. అయిజ ప్రధాన కేంద్రంగా జిల్లా మొత్తం బెట్టింగ్?లు సాగిస్తున్నట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు ఈ కేసులో ఏడుగురిని అరెస్టు చేయగా మరికొంత మంది పరారీలో ఉన్నట్లు ఎస్పీ రితిరాజ్ తెలిపారు. ప్రత్యేక దృష్టితో దర్యాప్తు కొనసాగుతోందని ఈ మొత్తం వ్యవహారంలో ప్రధాన పాత్ర ఎవరిది అనేది త్వరలోనే తేల్చుతామని ఆమె స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరు తమ పిల్లలపై ప్రత్యేకంగా నిఘా పెట్టాలని తల్లితండ్రులకు పోలీసులు సూచిస్తున్నారు. దర్యాప్తు అనంతరం బాధితుల ప్రాపర్టీని తిరిగి రికవరీ చేస్తామని చెబుతున్నారు. ఇక ఈ వ్యవహారంలో ఎంతటి వారు ఉన్న ఉపేక్షించకుండా, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## 150 అడుగుల లోయలో పడిపోయిన బస్సు

### -21 మంది మృతి



**టి.మీడియా, మే30,జమ్ము:** జమ్ము-కాశ్మీర్లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ప్రయాణికులతో వెళ్తున్న బస్సు లోయలో పడింది. ఈ ప్రమాదంలో 21 మంది మృతి చెందగా.. 40 మందికి తీవ్ర గాయాలయ్యాయి. హర్యాణాలోని కురుక్షేత్ర నుంచి ప్రయాణికులను తీసుకెళ్తున్న బస్సు జమ్ములోని అఖ్నూర్ వద్దకు రాగానే అదుపు తప్పి ఒక్కసారిగా లోయలో పడిపోయింది. రోడ్డుపై నుంచి దాదాపు 150 అడుగులో లోయలోకి బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదం కలిధర్ జిల్లాలో చోటు చేసుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ నుంచి ప్రయాణికులతో వెళ్తున్న బస్సు జమ్మూలోని అఖ్నూర్ తాండా సమీపంలో ప్రమాదానికి గురైంది. ప్రస్తుతం రెస్క్యూ టీం సహాయక చర్యలు చేపడుతోంది. శివ్ ఖోరీ ప్రాంతానికి యాత్రికులను తీసుకువెళుతుండగా ఈ ప్రమాం చోటు చేసుకుంది. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను జమ్మూలోని అఖ్నూర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ (జీఎంసి) ఆసుపత్రికి తరలించారు. అఖ్నూర్ సబ్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్‌కు మృతదేహాలను తరలించారు. ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## నకిలీవిత్తనాల విక్రయదారులపై కఠిన చర్యలు

### - కలెక్టర్లు, పోలీసులకు మంత్రి తుమ్మల ఆదేశాలు.



**టి మీడియా,మే 30,హైదరాబాద్ :** గురువారం సచివాలయంలో పత్తి, పచ్చిరొట్ట లభ్యత, విత్తనాల పంపిణీపై రాష్ట్రస్థాయి అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. విత్తనాల సరఫరాలో లోపాలు తలెత్తకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లాలకు సరిపడా ఎరువులు, విత్తనాలు అందిస్తున్నామని, జిల్లాలకు వచ్చిన విత్తనాల సరఫరాలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా వాటిని రైతులకు అందించే బాధ్యత కలెక్టర్లదేనని సూచించారు. కలెక్టర్లు, అధికారులు విస్తృతంగా పర్యటిస్తూ తనిఖీలు చేపట్టాలన్నారు. రద్దీ ఎక్కువగా ఉన్న చోట రైతులకు ఇబ్బందులు లేకుండా కౌంటర్లు ఎక్కువగా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. విత్తనాల కోసం రైతుల నుంచి డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఇవాళ మధ్యాహ్నం సీడ్ కంపెనీ ప్రతినిధులతో మంత్రి సమావేశం కానున్నారు.

కాగా పత్తి, పచ్చిరొట్ట విత్తనాల కోసం పలు జిల్లాల్లో రైతులు ఆందోళనకు దిగుతున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో పత్తి విత్తనాలను అందుబాటులో ఉంచాలని కోరుతూ పట్టణంలోని కిసాన్ చౌక్ వద్ద రైతులు రాస్తారోకో నిర్వహించారు. విత్తనాల కొనడానికి ఐదు రోజులుగా వస్తున్న ప్రతి రోజు కేవలం రెండు ప్యాకెట్లు మాత్రమే ఇస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇతర జిల్లాలోనూ దాదాపు ఇదే పరిస్థితి ఉందని ప్రభుత్వం స్పందించాలని రైతులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో విత్తనాలు, ఎరువుల విషయంలో తాజాగా సమీక్ష నిర్వహించిన మంత్రి.. అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## ఆదిలాబాద్ లో ఆగని విత్తనాల లొల్లి

### -పత్తి విత్తనాలు తరలిస్తుండగా అడ్డుకున్న రైతులు..

### -రాస్తారోకో.. స్తంభించిన రాకపోకలు



**టి మీడియా,మే 30,ఆదిలాబాద్:** డిమాండ్ ఉన్న పత్తి విత్తనాల కోసం గత మూడు రోజులుగా రైతులు రోడ్డెక్కి ఆందోళన బాట పట్టారు. మార్కెట్లో రాసి 659 పత్తి విత్తనాల కొరత కారణంగా ప్రతిరోజు దుకాణాల వద్ద పడిగాపులు కాస్తుంటే.. ఈరోజు పంజాబ్ చౌరస్తాలోని నిఖిల్ ట్రేడర్స్ విత్తనాల దుకాణం నుండి వాహనంలో 160 రాసి విత్తనాలను ఇచ్చోడ కేంద్రానికి తరలిస్తుండగా రైతులు పట్టుకొని అడ్డుకున్నారు.రోజంతా లైన్లో నిల్చుంటే.. రెండు పత్తి విత్తన బ్యాగులు కూడా దొరకడం లేదని, ప్రైవేట్ డీలర్లు కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేటు డీలర్ ను నిలదీసి రైతులంతా పంజాబ్ చౌరస్తా రహదారిపై బైఠాయించడంతో ఉద్రిక్తత నెలకొంది. వెంటనే డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య అక్కడికి చేరుకొని రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. హొల్ సేల్ దుకాణం నుండి ఇచ్చోడ రిటైల్ డీలర్ కు వే బిల్లుతో సహా రాసి రకం150 పత్తి విత్తనాల ప్యాకెట్లు పంపుతున్నట్టు డీలర్ పేర్కొన్నారు. దీంతో ఆగ్రహించిన రైతులు దొంగ చాటున విత్తనాలు అక్రమ వ్యాపారం సాగిస్తున్నారని నిలదీశారు.

### ప్రైవేట్ డీలర్ పై కేసు నమోదు..

నిఖిల్ ట్రేడర్స్ నుండి పత్తి విత్తనాలు తరలింపు వ్యవహారంపై లోతుగా విచారణ జరుపుతున్నామని, కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. నిజంగానే బ్లాక్ మార్కెట్ కు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ పేర్కొనడంతో రైతులు శాంతించారు. విత్తనాల కొరత, డీలర్ల ఆగడాలపై సమగ్ర దర్యాప్తు జరిపిస్తామని వ్యవసాయ అధికారి పుల్లయ్య హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు.

# శ్రీధర్ రెడ్డి హత్యకు కారకులు ఎవరు.

**-ఎనిమిది రోజులు గడిచిన నిందితులను పట్టుకొని పోలీసులు**

**- బిఆర్ఎస్ నాయకుడు కావడమే ఆయన చేసిన పాపమా.**



**టీ మీడియా,మే 30,చిన్నంబావి:**మండల కేంద్రంలో గురువారం బిఆర్ఎస్ నాయకులు పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్ష్మీ పల్లి గ్రామంలో గత బుధవారం రాత్రి బిఆర్ఎస్ నాయకుడు శ్రీధర్ రెడ్డి, హత్యకు గురయ్యాడు. హత్య జరిగి వారం రోజులు కావస్తున్న హంతకులు ఎవరనేది ఇప్పటి వరకు తెలియకపోవడంతో పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి అని అన్నారు. హత్యకు గల కారణాలు తెలియకపోవడంతో శ్రీధర్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకుడు కావడమే వారు చేసుకున్న పాపమా అని వారు అన్నారు. ఇంత టెక్నాలజీ వున్న ఈ కాలంలో కూడా ఒక కేసును చేదించడానికి నిందితులను గుర్తించ లేక పోవడానికి ఏమిటి కారణమని వారు అన్నారు.దీని వెనక బడా నాయకుల హస్తం ఉందనేది స్పష్టంగా అర్థమవుతుందనీ ఈ హత్యను తప్పు దోవ పట్టించడం కోసమే శ్రీధర్ రెడ్డి, హత్య పై అధికార పార్టీ నాయకులు ఎన్నో అసత్య ఆరోపణలు చేస్తున్నారని వారు అన్నారు. హంతకులను గుర్తించకపోవడం వెనుక మతలాబు ఏమిటి అని ఇప్పటి వరకు హంతకులను గుర్తించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది అని అన్నారు.అధికార పార్టీ అండ తోనే హంతకులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని వారు అన్నారు. శ్రీధర్ రెడ్డి, హత్యపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు అన్నారు.నిందితుల వెనక ఎంత పెద్ద నాయకులు ఉన్నా వదిలి పెట్టే ప్రసక్తే లేదని, నిందితులను అరెస్టు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని వారు అన్నారు. నిందితులను తొందరగా గుర్తించి అరెస్టు చేయాలని పోలీస్ శాఖ ను ప్రత్యేకంగా కోరుతున్నామని వారు అన్నారు. అలాగే జూన్ రెండవ తేదీన నిర్వహించే శ్రీధర్ రెడ్డి, సంతాప సభకు బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరమ్మ, జడ్పిటిసి వెంకటరమణమ్మ, వైస్ ఎంపీపీ పుష్పావతి, బిఆర్ఎస్ పార్టీ ఉమ్మడి మండల ఇంచార్జ్ గోవింద శ్రీధర్ రెడ్డి, బిఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు చిన్నారెడ్డి, బిఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్ లు మధు, రామస్వామి, వివిధ గ్రామాల బిఆర్ఎస్ నాయకులు జయ గౌడ్, రాజారెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, ప్రకాష్, శివారెడ్డి, శివుడు, దేగ శేఖర్, తగరం నరసింహ, కృష్ణ యాదవ్, బాల పీరు, గోపాల్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు, పాల్గొన్నారు.

# గ్రూప్ వన్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు



**టీ మీడియా, మే 30, వనపర్తి బ్యూరో :** విద్యార్థుల జూన్1 మధ్యాహ్నం 2 గంటల నుండి హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చిన పరీక్ష కేంద్రాల్లో అనుమతి లేదు ఎలక్ట్రానిక్ పరికరాలు సెల్ ఫోన్లు. గడియారం. ఆభరణాలు. పరీక్ష ప్యాడ్. లూజ్. పేపర్లు. బ్యాగ్. లాగార్థం బుక్. చార్ట్ వంటి ఎలాంటి పరికరాలు పరీక్ష కేంద్రంలో అనుమతించబడదు. అభ్యర్థులు బూట్లు కాకుండా చెప్పులు వేసుకుని రావాలి. విద్యార్థుల సందేహాలు సమస్యలు పరిష్కరించేందుకు జూన్ 8 .9. చేతిలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు వనపర్తి జిల్లా లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ సంజిత్ గంగ్వార్. జూన్ 9న జరిగే గ్రూప్1 ప్రిలిమీనరి పరీక్షను వనపర్తి జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు జగన్ తీసుకోవాలని వనపర్తి జిల్లా లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ సంజిత్ గంగ్వార్ ఆదేశించారు. గురువారం ఉదయం ఐ డి ఓ సి కాన్ఫరెన్స్ హాల్లో గ్రూప్1 పరీక్షల నిర్వహణ సన్నదాత పై అధికారులతో వెబ్ ఎక్స్ మీటింగ్ నిర్వహించారు. వనపర్తి జిల్లాలో4843 మంది అభ్యర్థులు గ్రూప్1 ప్రి మీనరి పరీక్ష రాయనున్నారు.ఇందుకు 17 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రాల్లో సి సి టీవీ కెమెరాలు పెట్టాలని సూచించారు. 144 సెక్షన్ అమలు. జిరాక్స్ కేంద్రాల మూసివేత పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఉదయం 10 గంటల లోపు పరీక్ష కేంద్రాన్ని చేరుకోవాలని ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చిన అనుమతించడం జరగదని అన్నారు. ఉదయం 9:30 నుండి బయోమెట్రిక్ హాజరు తీసుకోవడం జరుగుతుందని అభ్యర్థులు ప్రతి ఒక్కరు బయోమెట్రిక్ హాజరు నమోదు చేసుకోవాలని తెలిపారు. బయోమెట్రిక్ హాజరు కానీ విద్యార్థుల ఓఎంఆర్ షీట్ పరిగణంలోకి తీసుకో బడవని తెలియజేశారు. పరీక్ష రోజున పరీక్ష కేంద్రం ఎక్కడుందో తెలియక హడావుడి పడకుండా అభ్యర్థులు ఒక్కరోజు ముందుగానే తమ పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరీక్షించుకోవాలని తెలియజేశారు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాన్ని కొన్ని విధంగా 8 గంటల నుండి 9:30 వరకు టీ. ఎస్. ఆర్. టి. సి. బస్సులు రూట్ వారిగా నడపాలని ఆదేశించారు.

పరీక్ష కేంద్ర వివరాలు లేదా విద్యార్థుల సందేహాలు సమస్యలు పరిష్కరించేందుకు జూన్ 8. 9. లో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందనిన్నారు. హెల్ప్ డెస్క్ నెంబర్08545-233525 ఫోన్ చేసి సమాచారం తీసుకోవచ్చు అని తెలిపారు. చిత్రంలో వనపర్తి జిల్లా లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, పోలీస్ నోడల్ అధికారి డిఎస్పి కృష్ణ కిషోర్, రీజినల్ కోఆర్డినేటర్ కే. చంద్రశేఖర్, తాసిల్దార్ కిషన్ నాయక్, వెబ్ ద్వారా ఇతర జిల్లా అధికారులు,తాసిల్దార్ లు తదితరులు పాల్గొన్నారు.

## 60వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు

### -కలెక్టర్ రాహుల్ రాజ్



**టి మీడియా,మే 30, మెదక్ :** జిల్లా వ్యాప్తంగా బుధవారం వరకు రెండు లక్షల 60 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని వెల్మకన్నె గ్రామంలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్ రాజ్ సందర్శించారు. తేమశాతాన్ని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ రాహుల్ రాజ్ మీడియాతో మాట్లాడుతూ%%. జిల్లాలో రెండు లక్షల 60వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని సేకరించడం జరిగిందన్నారు. గత సంవత్సరానికి పోల్చుకుంటే 70వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అదనంగా కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే 300 కొనుగోలు సెంటర్లను క్లోజ్ చేయడం జరిగిందని 100 సెంటర్లు మాత్రమే కొనసాగుతున్నాయని, రెండు మూడు రోజుల్లో మిగిలిన సెంటర్లు కూడా ధాన్యాన్ని కొనుగోలు చేసి మూసి వేయడం జరుగుతుందన్నారు. పచ్చి రొట్టె విత్తనాల కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జిల్లాకు సంపూర్తిగా విత్తనాలను సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే నాలుగు వేల క్వింటాళ్ల జీలుగ విత్తనాలను సరఫరా చేయడం జరిగిందన్నారు. ధాన్యం డబ్బులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. రెండు మూడు రోజుల వరకు వర్ష సూచన లేదన్నారు. రైతులెవరు కూడా ఆందోళన చెందకూడదని ఈ సందర్భంగా తెలియజేశారు. అనంతరం నాక్సన్ పల్లిలోని డీసీఎంఎస్ జీలుగ విత్తనాల విక్రయ దుకాణాన్ని తునికి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. కలెక్టర్ వెంట మండల తహసీల్దార్ ఆంజనేయులు, ఏడీఏ పుణ్యవతి, మండల విద్యాధికారి బుచ్చనాయక్, ఆర్ఐ శ్రీహరి, వ్యవసాయ అధికారి స్వప్న, విస్తరణ అధికారి రాజశేఖర్ గౌడ్, తదితరులున్నారు.

## నాయకంటి నరసింహ శర్మకు ఘన సన్మానం



**టీ మీడియా, మే 30, వనపర్తి బ్యూరో :** హైదరాబాదులోని రవీంద్రభారతిలో సురవరం ప్రతాపరెడ్డి జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. తెలుగు భాషా చైతన్య సమితి కుసుమ ధర్మన్న కళా పీఠం పాలడుగు నాగయ్య సాహితీ పీఠం సంయుక్తంగా నిర్వహించిన సురవరం ప్రతాపరెడ్డి కవి సమ్మేళనంలో వనపర్తి జిల్లాకు చెందిన ప్రముఖ కవి సాహితీవేత్త సురవరం ప్రతాపరెడ్డి పై పద్యగానం చేసినందుకుడాక్టర్ నాయకంటి నరసింహ శర్మను ఉస్మానియా విశ్వ విద్యాలయం పూర్వ ఆచార్యులు ప్రముఖ ఆధ్యాత్మిక సాహితీవేత్త డాక్టర్ కసిరెడ్డి వెంకటరెడ్డి గారు కుసుమ ధర్మ పీఠం అధ్యక్షురాలు డాక్టర్ రాధాకుసుమ, పాలడుగు నాగయ్య, సాహితీ పీఠం అధ్యక్షురాలు స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ పాలడుగు సరోజినీ దేవి, సురవరం ప్రతాపరెడ్డి కుమారులు వెంకట కృష్ణారెడ్డి ఇతరులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్, సభ్యులు బైరోజు చంద్రశేఖర్, ప్రముఖ సాహితీవేత్త నారాయణ రెడ్డి, జనజ్వాల, చందాపురం బుచ్చయ్య, బండారు శ్రీనివాస్ మొదలగు వారు అభినందనలు తెలిపారు.వనపర్తికి చెందిన పలువురు కవులు సాహితీవేత్తలు అభినందించారు.

## కార్మికుల తరపున పోరాడేది సిఐటియు మాత్రమే

### -వట్టెపు సైదులు.



**టి మీడియా,మే30,మేళ్ళ చెరువు:**1970 మే30 సిఐటియు ఆవిర్భావం నుండి నేటి వరకు సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యలపై వారి హక్కుల సాధన కొరకు నిరంతరం సీఐటీయు పోరాటాలు చేస్తుందని, రానున్న రోజులలో కార్మిక వర్గం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వట్టెపు సైదులు కార్మికులకు పిలుపునిచ్చారు. సిఐటియూ 54 వ ఆవిర్భవ దినోత్సవాన్ని పునస్కరించు కొని గురువారం మేళ్ళ చెరువు మండల కేంద్రంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 1970 సంవత్సరంలో ఐక్యత -పోరాటం నినాదంతో యూనియన్ ఏర్పాటు జరిగినది. అనేక పోరాటాలు రూప కల్పన తో కార్మిక వర్గం విజయాలు సాధించిందని, ప్రభుత్వాలు విద్యా, వైద్యం ప్రయివేట్ చేయటం వలన కార్మిక వర్గం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను కార్పోరేట్ శక్తుల కొరకు నాలుగు లేబర్ కోడులను సృష్టించి కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ప్రయివేట్ చేయటం వలన నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవని, ఫలితంగా రిజర్వేషన్ విధానాన్ని ప్రభుత్వము దెబ్బ తీస్తుందని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతన చట్టాన్ని సవరించకపోవడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయని, కార్మికులకు సంక్షేమ బోర్డు పెండింగ్ పెండింగ్ క్లైములు కొరకు కార్మికులు పోరాటాలు చేస్తున్నారని తక్షణమే పరిష్కరించాలని, సంక్షేమ బోర్డు నిధులను పక్కదారి మళ్లించకుండా నూతన సంక్షేమ పథకాల ద్వారా కార్మికులకు చేయూతనందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించండి..

### -విద్యుత్ శాఖ ఏఈ ప్రభాకర్ రెడ్డి



**టీ మీడియా, మే30, మహానంది:**విద్యుత్ వినియోగదారులు సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలని విద్యుత్ శాఖ ఏఈ ప్రభాకర్ రెడ్డి కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. మహానంది మండలంలోని విద్యుత్ వినియోగదారులందరూ, సకాలంలో తమ బిల్లులు చెల్లించి,అపరాధ రుసుం భారిన పడకుండా చూసుకోవాలని కోరారు. విద్యుత్ బిల్లులు కొట్టిన వెంటనే 14 రోజుల్లోగా చెల్లిస్తే, ఎటువంటి అపరాధ రుసుము కట్టాల్సిన అవసరం లేదన్నారు.గృహాలకు వినియోగించే వారు గడువులోపు, విద్యుత్ బిల్లులు చెల్లించి, విద్యుత్ అధికారులకు సహకరించాలన్నారు.

## వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం

### ౨డాక్టర్ జయచంద్ర మోహన్



**టీ మీడియా, మే 30, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లాలోని అందరు వైద్యాధికారులకు మరియు డేటా ఎంట్రీ ఆపరేటర్లకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయచంద్ర మోహన్ ఆధ్వర్యంలో సమీక్ష కార్యక్రమం నిర్వహించి అన్ని సబ్ సెంటర్ స్థాయి నుంచి జిల్లా ఆస్పత్రి వరకు నిర్వహిస్తున్న ఆరోగ్య సేవల వివరాలను ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ ప్రకారం నేషనల్ హెల్త్ సిస్టమ్స్ రిసోర్స్ సెంటర్ ద్వారా ఉత్పన్నమైన ఓడీకే యాప్ అసెస్మెంట్ టూల్ యందు నందు అందిస్తున్న ఆరోగ్య సేవలు,ఉన్న సదుపాయాలు, డయాగ్నోస్టిక్స్, ఆసుపత్రిలో మౌలిక నిర్మాణం, అందుబాటులో ఉన్న పరికరాలు, మానిటరింగ్ మరియు సర్టిఫికేషన్, మానవ వనరుల జవాబుదారీతనం మరియు నిర్వహణ, క్లినికల్ గవర్నెన్స్ , మందుల గురించి ఓడీకే యాప్ నందు అప్లోడ్ చేయాలని తెలియజేయడం జరిగింది. ఈ ప్రక్రియ రెండు రోజుల్లో కంప్లీట్ చేయాలని ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపవైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీ అల్లే శ్రీనివాసులు, ప్రోగ్రాం అధికారులు మంజుల పరిమళ పాల్గొనడం జరిగింది.

## ప్రభుత్వ బడులలో చేపట్టిన మరమ్మతు పనులు పూర్తి చేయాలి

### ౨ వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్



**టీ మీడియా, మే 30, వనపర్తి బ్యూరో :** అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా ప్రభుత్వ బడులలో చేపట్టిన మరమ్మతు పనులు పాఠశాలలు పున ప్రారంభం లోపు పూర్తి చేయాలని వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ ఆదేశించారు.

గురువారం పెబ్బేరు మండల పరిధిలోని గుమ్మడం గ్రామం. యాపర్ల గ్రామం. చిన్నంబావి మండలం కొప్పునూరు గ్రామం. చిన్న మారు గ్రామం. వెల్టూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. ప్రభుత్వ బడులలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్ని వేగంగా పూర్తి చేయాలని సూచించారు. పనుల నిర్వహణలో ఎక్కడ అలసత్వానికి తావివ్వకూడదని తెలిపారు. తాగునీటి వసతి, వంట గది, మరుగుదొడ్ల సహా అన్ని పక్కాగా ఉండేలా మరమ్మతుల కు చర్యలు తీసుకోవాలని అన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పెబ్బేరు మండలం యాపర్ల గ్రామంలో రైతులతో ముఖాముఖి మాట్లాడిన వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్. ఎరువులు విత్తనాల విషయంలో ఏమైనా సమస్యలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు.ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కారం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను సూచించారు. పెబ్బేరు మండలం యాపర్ల. చిన్నంబావి మండలం కొప్పునూరు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలను సందర్శించిన వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్. రికార్డులను పరిశీలించారు. గుడ్లు. పాలు. తదితర సామాగ్రిని నిలువలను పరిశీలించారు. చిత్రంలో వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్. వనపర్తి జిల్లా పంచాయతీ రాజ్ కార్యనిర్వాహణ ఇంజనీర్ మల్లయ్య. పెబ్బేరు తహసిల్దార్ లక్ష్మి,చిన్నంబావి తహసిల్దార్ ఇక్బాల్,ఎంఈఓ లక్ష్మణ్ నాయక్, మీడియా పౌర సమాచార అధికారి సీతారాం నాయక్, కలెక్టర్ సిసి తిలక్ రెడ్డి, వివిధశాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

## ఓట్ల లెక్కింపులో విధులు కేటాయించిన ఉద్యోగులు తమ బాధ్యతలు జాగ్రత్త నిర్వహించాలి

### ౨ వనపర్తి జిల్లా అదనపు( రెవిన్యూ) కలెక్టర్ ఎం నాగేష్



**టీ మీడియా, మే 30, వనపర్తి బ్యూరో :** జూన్ 4న నాగర్కర్నూల్ మార్కెట్ యార్డులో జరిగే పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపులో విధులు కేటాయించిన ఉద్యోగులు తమ బాధ్యతలు జాగ్రత్త నిర్వహించాలని వనపర్తి జిల్లా అదనపు( రెవిన్యూ) కలెక్టర్ ఎం నాగేష్ తాసిల్దార్, నాయబ్తహసీల్దార్లను ఆదేశించారు. గురువారం ఉదయం ఐ డి ఓ సి సమావేశ మందిరంలో కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ సలహాలు సూచనలు ఇచ్చారు. అప్పగించిన బాధ్యతలు నిబంధనలతో పూర్తి చేయాలని అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. చిత్రంలో వనపర్తి జిల్లా అదనపు ( రెవెన్యూ) కలెక్టర్ ఎం నాగేష్, వనపర్తి ఆర్టీవో పద్మావతి, వనపర్తి జిల్లా కలెక్టరేట్ సి సెక్షన్ తాసిల్దార్ రమేష్ రెడ్డి, పాండు నాయక్, శ్రీనివాస్, మదన్ మోహన్, నాయబ్ తహసిల్దార్లు తదితరులు ఉన్నారు.

## పాఠశాల మరమ్మతు పనులు సకాలంలో పూర్తి చేయాలి.

### -జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్



**టీ మీడియా,మే 30,చిన్నంబావి:** మండలం లోని కొప్పునూర్, చిన్నమార్, వెల్టూర్, గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల లను అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా ప్రభుత్వ బడులలో చేపట్టిన మరమ్మతు పనులు పాఠశాలలు పున ప్రారంభం లోపు పూర్తి చేయాలని వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్,పాఠశాలలను పరిశీలించిన అనంతరం అధికారులను ఆదేశించారు.మండలం లోని ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. ప్రభుత్వ బడులలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్ని వేగంగా పూర్తి చేయాలని సూచించారు. పనుల నిర్వహణలో ఎక్కడ అలసత్వానికి తావివ్వకూడదని తెలిపారు. తాగునీటి వసతి, వంట గది, మరుగుదొడ్ల సహా అన్ని పక్కాగా ఉండేలా మరమ్మతుల కు చర్యలు తీసుకోవాలని అన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు.కొప్పునూరు గ్రామం లోని అంగన్వాడీ కేంద్రాలను సందర్శించిన వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్. రికార్డులను పరిశీలించారు. గుడ్లు. పాలు. తదితర సామాగ్రిని నిలువలను పరిశీలించారు. చిత్రంలో వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్. వనపర్తి జిల్లా పంచాయతీ రాజ్ కార్యనిర్వాహణ ఇంజనీర్ మల్లయ్య. తహసిల్దార్ ఇక్బాల్, ఎస్సై రమేష్, ఎంఈఓ లక్ష్మణ్ నాయక్, మీడియా పౌర సమాచార అధికారి సీతారాం నాయక్, కలెక్టర్ సిసి తిలక్ రెడ్డి, వివిధశాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

## జనగణనతో పాటు కులగణన కూడా చేపట్టాలి

### -బీసీ నేత ధనుంజయనాయుడు



**టి మీడియా,మే30.,హుజూర్ నగర్:** గత శాసనసభా ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ వ్యాప్తంగా కుల గణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా కమిటీ కన్వీనర్ ధూళిపాళ ధనుంజయ నాయుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం నాడు ఆయన హుజూర్నగర్ బిసి ముఖ్య లతో కలిసి పాత్రికేయులతో మాట్లాడుతూ హడావుడిగా స్థానిక ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం లేదని ప్రస్తుతం జరుగుతున్న జన గణనతో పాటు కుల గణన చేపట్టి ఆయా కులాలకు దామాషా పద్ధతుల్లో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల అవకాశం కల్పించాలని, ప్రస్తుతం ఉన్న 20% స్థానిక సంస్థల్లో బీసీలకు ఉన్న రిజర్వేషన్లు కనీసం 45 శాతానికి పెంచాలని, కులగణన చేపట్టకపోతే మళ్లీ బీసీలకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉన్నందున గత ప్రభుత్వం బీసీలకు చేసిన ద్రోహమే ఆ పార్టీ పట్ల శాపమై అధికారం, చేజారిపోయిందని , ఆ ప్రభుత్వం చేసిన తప్పులను నేడున్న కాంగ్రెస్ ప్రభుత్వం చేయరాదని, ఆయన హితవు పలికారు. నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం పచ్చి బీసీ వ్యతిరేక ప్రభుత్వమని ఆ ప్రభుత్వం అధికారం ఉన్న పది సంవత్సరాలలో బీసీలకు కనీసం ఒక్క సంక్షేమ పథకం కూడా చేపట్టలేక పోయిందని, బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ కావాలని, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య నేతృత్వంలో అనేక దఫాలు వివిధ రూపాల్లో ఆందోళన చేసినప్పటికీ ఆ ప్రభుత్వానికి కనీసం చీమకుట్టినట్లైనా లేకపోవడం విచారకరమని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంక్షేమ సంఘం హాస్టల్లో మరమ్మతులకు కనీసం 20 కోట్లు కేటాయించి మరమ్మత్తులు చేపట్టాలని మరుగుదొడ్లు మంచినీటి సౌకర్యంతో పాటు విద్యుత్ సౌకర్యం లాంటి కనీస సౌకర్యాలు మెరుగుపరచాలని ఆయన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ని కోరారు. సమావేశానికి పట్టణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొడ్డు గోవిందరావు అధ్యక్షత వహించగా, పట్టణ ప్రధాన కార్యదర్శి రాయల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు చేపూరి నరసింహ చారి ,యువజన విభాగంజిల్లా నాయకులు చిలకరాజు శ్రీను, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు గూడెపు దీప, మేకల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లాలో తీవ్ర విషాదం

### సింగరేణి జీడీకే-11 లో ప్రమాదం ఒకరి మృతి



**టి మీడియా,మే 30,పెద్దపల్లి:** జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సింగరేణి జీడీకే-11 బొగ్గు గనిలో గురువారం తెల్లవారుజామున తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు బొగ్గును వెలికితీసే మిషన్ ఢీకొని ఎల్హెచ్డీ ఆపరేటర్ ప్రతాప్కు తీవ్ర గాయలయ్యాయి. గమనించిన సిబ్బంది అతడిని ఆసుపత్రికి తరలిద్దామనే లోపే ప్రాణాలు విడిచాడు. ఈ మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని సింగరేణి ఏరియా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. అయితే, మృతుడు ప్రతాప్ స్వస్థలం రామగిరి మండలం పన్నూరు గ్రామానికి చెందిన వాడని తోటి కార్మికులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## నలుగురు దోపిడీ దొంగల ముఠా అరెస్ట్



**టి మీడియా,మే 30,ఆదిలాబాద్:** గంజాయి మాదక ద్రవ్యాలకు అలవాటు పడి సునాయాసంగా డబ్బులు సంపాదించాలన్న అత్యాశతో నలుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠా చాకచక్యంగా దోపిడీకి పాల్పడుతూ పోలీసుల వలకు చిక్కారు. నిందితులే బాధితులుగా నమ్మిస్తూ.. సినీ ఫక్కీలో దోపిడీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర ముఠాకు చెందిన నలుగురిని ఆదిలాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్పీ గౌడ్ సలాం గురువారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు.ఆదిలాబాద్ పట్టణం వడ్డెర కాలనీకి చెందిన మీర్జ ముషరఫ్ బేగ్ అలియాస్ ముషరఫ్, ముస్సు, షేక్ బిలాల్, గజ్బే అక్షయ్, జైనథ్ మండలం రామాయి గ్రామానికి చెందిన మేస్రం దత్తు అనే నలుగురు నిందితులు దోపిడీ దొంగతనాలకు పాల్పడుతూ డబ్బుతో జల్సాలు చేయడం, గంజాయి, మందు లాంటి మాదక ద్రవ్యాలను సేవించడం అలవాటుగా చేసుకున్నారు. డబ్బుల కోసం హత్యలు, దోపిడీలు, ద్విచక్ర వాహనాల దొంగతనాలు, ఇళ్ల దొంగతనాలు లాంటి పలు రకాల నేరాలకు పాల్పడుతున్నారని ఎస్పీ తెలియజేశారు.ఈ ముఠా తెలంగాణ మహారాష్ట్రలో అనేక దోపిడీలు చేసినట్టు వెలుగు చూసిందని, నిందితుల వద్ద నుండి కారు, ఆటో, సెల్ ఫోన్, 4000 నగదు స్వాధీన పరచుకున్నట్టు ఎస్పీ తెలిపారు. ఈ కేసును చేధించిన డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డిని, టూ టౌన్ సిఐను, ఐటీ కోర్ సిబ్బంది సంజీవ్ కుమార్, ఎం ఏ రియాజ్, క్రైమ్ పార్టీ సిబ్బంది రమేష్, నరేష్, క్రాంతి, నరేందర్, సురేందర్ రెడ్డిలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. వీరిపై ఇప్పటికే 20 కేసులు నమోదై ఉన్నట్టు తెలిపారు.

## యూపీలో కరెంట్ కోతలు..ప్రజల నిరసనలు



**టీ మీడియా, మే 30,లక్నో:** ఒకవైపు ఎండలు మండుతుండగా మరోవైపు విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడుతున్నారు. దీంతో వీధుల్లోకి వచ్చి నిరసనకు దిగుతున్నారు. గంటల కొద్దీ పవర్ కట్లపై మండిపడుతున్నారు. ఉత్తరప్రదేశ్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల సెల్సియస్ దాటాయి. దీంతో ప్రజలు ఎండలకు తాళలేకపోతున్నారు. మరోవైపు విద్యుత్ వినియోగం పెరుగడంతో ఎడాపెడా కోతలు విధిస్తున్నారు. దీంతో ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలు చేస్తున్నారు. కాగా, ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోతోపాటు నోయిడా, ఘజియాబాద్, మీరట్, ప్రయాగ్రాజ్ వంటి నగరాల్లో కూడా విద్యుత్ కోతలు అధికంగా ఉన్నాయి. దీనిపై ప్రజలు మండిపడుతున్నారు. బుధవారం లక్నోలోని కొన్ని ప్రాంతాల్లో ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు. విద్యుత్ మంత్రి ఏకే శర్మకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మీరట్, ప్రయాగ్రాజ్, సీతాపూర్లో కూడా స్థానికులు నిరసనలకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మరోవైపు మే 27న లక్నోలోని రాజాజీపురంలో ట్రాన్స్ఫార్మర్లో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో పలు గంటలపాటు విద్యుత్ నిలిచిపోయింది. ఆగ్రహించిన స్థానికులు సబ్స్టేషన్ను ముట్టడించారు. పవర్ హౌస్లోకి ప్రవేశించి కంప్యూటర్లు, ఇతర వస్తువులను ధ్వంసం చేశారు. పోలీసులు రంగప్రవేశం చేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

## రూ.20లక్షల విలువైన డ్రగ్స్ను స్వాదీనం ఎక్సైజ్ పోలీసులు



**టీ మీడియా, మే 30,హైదరాబాద్ :** ఇతర రాష్ట్రాల నుంచి డ్రగ్స్ను గుట్టు చప్పుడు కాకుండా తీసుకువచ్చి ఈ వెంట్ నిర్వా హకులతో పాటు ఐటీ ఉద్యోగులకు అమ్మకాలు చేస్తున్న ముఠాను శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన తృప్తి ప్రభాకర్ హెూకం(21), మధ్య ప్రదేశ్కు చెందిన అనుభవ్ సక్సేనా (24) హైదరాబాద్లో నిర్వహిస్తున్న ఈవెంట్ నిర్వాహకులకు డ్రగ్స్ను విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు బండ్లగూడ జాగీర్ సన్సిటీ మోర్ సూపర్ మార్కెట్ వద్ద వారిని అదుపులోకి తీసుకుని 270 గ్రాముల ఎండీఎంఏ మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.20లక్షల వరకు ఉంటుందని తెలిపారు. వారిని విచారించగా చంద్రపూర్ కు చెందిన సాబర్ అనే వ్యక్తి నుంచి కోరియర్ ద్వారా తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు వారు తెలిపారు. ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించినట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు.

## రేపు ఆంజనేయ స్వామి జన్మదినోత్సవ ఉత్సవాలు



**టి.మీడియా, మే30,ఆత్మకూరు:** మున్సిపాలిటీ పరిధిలో నేతాజీ నగర్ నందు, ఎన్ ఆర్ యువసేన ఆధ్వర్యంలో, శ్రీ ఆంజనేయ స్వామి జన్మదినోత్సవాలు శనివారం నిర్వహిస్తామని పాలక మండలి వారు తెలిపారు.ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ,11:30 కు గణపతి హెూమం,నవగ్రహ ఆరాధన, కృష్ణా జలాలతో ఆంజనేయస్వామికి అభిషేకం,అనంతరం స్వామి వారి సన్నిధిలో 1:30 గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించబడును. సాయంత్రం ఐదు గంటలకు ఉత్సవ విగ్రహము, ఊరేగింపు,శోభ యాత్ర పురవీధుల్లో అంగరంగ వైభవంగా నిర్వహించబడును.

## గుర్తుతెలియని మహిళా మృతి

**టీ మీడియా, మే30, మహానంది:** మండలం ఆర్ఎస్ గాజులపల్లె గ్రామ సమీపంలోని రైల్వే స్టేషన్ లో గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు అక్కడి స్థానికులు గురువారం తెలిపారు. మృతురాలు సుమారు 40 సంవత్సరాలు కలిగి, ఆకుపచ్చని చీర, నీలం రంగు రవిక పొగడను ధరించి ఉన్నదని తెలిపారు. ఆమె మానసిక వికలాంగురాలుగా బుధవారం రాత్రి రైల్వే స్టేషన్ కు అనుకొని మెట్ల సమీపంలో అనుకొని మృతి చెందిందని తెలిపారు. అక్కడి స్థానికులు నంద్యాల రైల్వే పోలీసులకి సమాచారం అందించారని, వారు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టిన తెలిపారు.

# అడుగడుగునా స్పీడ్ బ్రేకర్లే

**- పట్టించుకోని అధికారులు ప్రజా ప్రతినిధులు**

**-ప్రమాదాలకు నిలవుగా మారిన మధిర రైల్వే ఓవర్ బ్రిడ్జి**



**టి మీడియా,మే 30,మధిర:** పట్టణం నడిబొడ్డులో ఉన్న రైల్వే ట్రాక్ పట్టణాన్ని రెండుగా విడదీస్తున్న క్రమంలో దీనిపై అనుసంధానంగా వాహనాల రాకపోకలను కొనసాగించేందుకు ఏర్పాటుచేసిన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయిన తర్వాత కొంతకాలం వరకు ప్రజలకు సేవనందించింది. గడిచిన పదేళ్ల కాలంగా ఈ బ్రిడ్జిపై ఉన్న స్లాబుల జాయింట్ ప్రాంతాలలో ఏర్పాటుచేసిన రబ్బరు జాయింట్ సీళ్ళు కొన్ని ప్రాంతాల్లో పనికిరాకుండా పోగా మరికొన్ని ప్రాంతాల్లో లేకుండా ఉండడంతో పిల్లలకు పిల్లలకు మధ్య వేసిన స్లాబుల మధ్య గాడీలు కాలువ లాగా ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర విఘాతం కలుగుతోంది. ఈ సమస్యపై పదేళ్ల కాలంగా మధిర లో ఉన్న ఆర్ అండ్ బి అధికారులు నిత్యం చూస్తున్నప్పటికీ వారి వాహనాలు ఇదే రహదారిపై రాకపోకలు సాగుస్తున్నప్పటికీ వీటి మరమ్మత్తులకు అవసరమైన చర్యలు తీసుకోకపోవడం ఆ శాఖ యంత్రాంగం విధి నిర్వహణలో వ్యవహరిస్తున్న నిబద్ధతకు నిదర్శనంగా మారింది. నిత్యం వందలాదిగా ప్రయాణం సాగించే భారీ వాహనాలతో పాటు కార్లు ద్విచక్ర వాహనాలు ఆటోలు ఇతర ప్రయాణ సంబంధ వాహనాలు ఈ రహదారిపై బ్రిడ్జి మీదుగా వెళుతున్న క్రమంలో అనేక ప్రమాదాలకు గురవుతుండడం గమనార్హం. గుంటలు ఏర్పడిన ప్రాంతాలలో వాహనాలను తప్పించబోయి ఎదురుగా వచ్చే వాహనాలను ఢీ కొట్టి మృత్యువాత పడిన వారితోపాటు క్షతగాత్రులైన వారి సంఖ్య పదేళ్ల కాలంలో వందల్లో ఉందంటే అతిశయోక్తి కాదేమో. నిన్న రాత్రి మధిర ఆర్టీసీ డిపోలో అద్దె బస్సు డ్రైవర్ గా పనిచేస్తున్న ఎర్రుపాలెం మండలం బనగాళ్లపాడు గ్రామానికి చెందిన రాజశేఖర్ అనే వ్యక్తి కూడా ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడి మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. ప్రమాద సమయంలో సదరు డ్రైవరు తన ద్విచక్ర వాహనాన్ని ముందుకు తోలుతున్న క్రమంలో గుంటగా ఏర్పడిన ప్రాంతం నుండి తప్పించబోయి ప్రమాదానికి గురైనట్లు సమాచారం. ఇదిలా ఉండగా మధిర పట్టణ%శీ% మున్సిపాలిటీలోని ప్రజలకు ఎన్నికల హామీగా మారిన ఈ రహదారి మరమ్మత్తులు ఆరోబిపై ఏర్పడిన స్పీడ్ బ్రేకర్ల మరమ్మత్తులపై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్పై స్థానికంగా ఉన్న అధికారులు సమస్యపై దృష్టిసారించకపోవడం పట్ల ప్రజలు తీవ్ర ఆవేదనతో కూడిన విమర్శలు చేస్తున్నారు. గడచిన పదేళ్ల కాలంలో వందల కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహించామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రజాప్రతినిధులు నిత్యం పట్టణ ప్రజలతో పాటు మధిర ప్రాంతం మీదుగా అంతరాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఈ సమస్యపై కనీసం దృష్టి సారించకపోవడం వారి విజ్ఞతకు పాలనదక్షతకు నిదర్శనం అంటూ విమర్శలను ఎక్కు పెట్టడం గమనార్హం. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మధిర మున్సిపాలిటీ లో డ్రైనేజీ వ్యవస్థలు అస్తవ్యస్తంగా మారగా, అంతర్గత రహదారులు పరిస్థితి కూడా ఎందుకు భిన్నంగా లేకపోవడం గమనించాల్సిన విషయం. ఇప్పటికైనా రోడ్లు భవనాల శాఖ అధికార యంత్రం యంత్రాంగం స్పందించి ఆరోబిపై నెలకొన్న సమస్యను పరిష్కరించే దిశగా తక్షణ మరమ్మత్తులు నిర్వహించాలని, ప్రధాన రహదారిపై వాహనదారులను అలర్ట్ చేసే దిశగా ఏర్పాటు చేయాల్సిన హెచ్చరికల బోర్డులను ప్రజలకు అవగాహన కల్పించేలా ఏర్పాటు చేయాలని అన్ని వర్గాల ప్రజలు కోరుతున్నారు. అద్దె బస్సు డ్రైవర్ రాజశేఖర్ మృతి ఆ మధ్యతరగతి కుటుంబానికి తీరని లోటు విషాదాన్ని మిగిల్చిన దురదృష్టకర పరిస్థితి మరికొందరి కుటుంబాలకు రాకుండా నిలువురించే దిశగా తక్షణ మరమ్మత్తు చర్యలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలి చొరవ చూపాలని మధిర పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవం పతాకావిష్కరణ..

**- ఆసంఘటితంగా కార్మికులకు కనీస వేతనం 26000లు**

**- గీట్ల ముకుంద రెడ్డి సీఐటీయూ అధ్యక్షులు**



**టీ మీడియా, మే 30,కరీంనగర్:** సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు గీట్ల ముకుంద రెడ్డి మానకొండూరు మండలం సదాశివ పల్లి లో సీఐటీయూ పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ముకుంద రెడ్డి మాట్లాడుతూ%ౌ% కార్మిక వర్గ హక్కులకై రాజీలేని పోరాటాలు నిర్వహించడానికి, రివిజనిస్ట్ పోకడలకు వ్యతిరేకంగా ఐక్యతా పోరాటం నినాదంగా 1970లో సీఐటీయూ ఆవిర్భవించిందన్నారు. అప్పటినుండి ఇప్పటివరకు కార్మికుల హక్కుల కోసం అనేక పోరాటాలు, సార్వత్రిక సమ్మెలు చేసిందన్నారు. జాతీయోద్యమ కాలం నుండి కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను యజమానులకు అనుకూలంగా సవరణలు చేస్తూ నాలుగు లేబర్ కొడులను మోడీ సర్కార్ తీసుకొచ్చిందని, దీనికి వ్యతిరేకంగా కార్మిక వర్గం నిరంతరం పోరాడుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వ విధానాలకు భిన్నంగా ఏమీ లేదన్నారు. 15 సంవత్సరాలుగా సవరణకులకు నోచుకోని 73 షెడ్యూల్ పరిశ్రమల వేతనాల సవరణకు డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఈ ప్రభుత్వం ఇచ్చింది. కానీ వేతనం ఏమాత్రం పెంచకుండా బేసిక్, డిఏ కలిపి ఎంత అవుతుందో అంతే ఇచ్చి కార్మిక వర్గానికి తీవ్రమైన అన్యాయం చేస్తుందన్నారు. కష్టపడి పనిచేసే శ్రామికులకు ఇవ్వవలసిన దగ్గర సరియైన వేతనాలు ఇవ్వకుండా, అందుకు కావలసిన జీవోలు సవరణ చేయకుండా పేదలకు ఏదో సంక్షేమం చేస్తున్నట్టు పాలక పార్టీలు ఫోజులు పెడుతుంటాయి. ఆ సంక్షేమ పథకాలు కూడా ఉపయోగపడేది పరోక్షంగా యజమానులకే అని అన్నారు. కార్మిక వర్గ ఐక్యత, పోరాటల ద్వారానే అనేక సమస్యలు పరిష్కరించమని, విజయాలు సాధించామని రాబోయే కాలంలో కూడా కార్మిక వర్గం కులాలు, మతాలు, ప్రాంతాలకతీతంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ భద్రయ్య, చౌదరి సంపత్ గట్టు సతీష్, పోచయ్య, శ్రీనివాస్ ఎస్ రమేష్, వనం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ వార్షిక వేడుకలలో పాల్గొన్న ౨ మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**టీ మీడియా, మే 30, వనపర్తి బ్యూరో :** మల్కాజిగిరి, శామీర్పేట్ మండలం దేవరంజల్ గ్రామం సేవలాల్ తండాలో నిర్మించిన సేవాలల్ మహారాజ్ గుడి వార్షిక వేడుకలలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలల్ మహారాజ్ జగదాంబభవాని మాత అనుగ్రహముతో జన్మించిన దైవాంశ సంభూతుడు అని వారు గిరిజనలలో చైతన్యం, ఆత్మగౌరవం కలిపించి వారిలో మద్యనిషేధం, దుమపానం, దొంగతనము వంటి గుణాలను మాన్పించి ప్రకృతినీ ప్రేమించడం,ముగజీవులను ప్రేమించడం వ్యవసాయాన్ని జీవనాధారం చేసుకోవడం పట్ల ఆసక్తి కలిపించి ఆత్మగౌరవంతో జీవించేటట్లు చేశాడు.దేశవ్యాప్తంగా గిరిజనులను చైతన్యం చేస్తూ బ్రిటిష్,నైజాం ప్రభుత్వాల వెట్టిచాకిరి నుండి గిరిజనులను విముక్తులను చేసారు హైదారాబాద్ లోని బంజారాహిల్స్ సేవాళాల్ కృషి మేరకు ఏర్పాటు చేశారు అని అన్నారు.సేవళాల్ అశీర్వాదాలతో నేటి గిరిజనులు ఆదర్శంగా జీవిస్తున్నారని అన్నారు. కె.సి.ఆర్ తాండాలని ప్రత్యేక గ్రామపంచాయితీ లను చేయడం ద్వారా గిరిజనులు స్వపరిపాలన సమానత్వం సౌభ్రాతృత్వం సహనం ఓర్పు నేర్పు వంటి గుణాలతో సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు అని అన్నారు. గిరిజనులు రాజకీయంగా కూడా ఎదిగి వారి జాతి అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.కాశింనగర్ రాజు నిర్వాహకుల ఆహ్వానం మేరకు వార్షికోత్సవంలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. నిరంజన్ రెడ్డి గారి వెంట రజనీసై చందు రాష్ట్ర బి.ఆర్.ఎస్ నాయకురాలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకి బెదిరింపు కాల్స్..

**-సీఎం రేవంత్ నంబర్ షేర్**




**టి,మీడియా, మే30,హైదరాబాద్:**గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కు బెదిరింపు కాల్స్ వచ్చినట్లు తన ట్విట్టర్ ఖాతాలో వెల్లడించారు. తనను చంపేస్తామంటూ పలు నంబర్లనుంచి కాల్స్ చేసినట్లు తెలిపారు. దానికి సంబంధించిన స్క్రీన్ షాట్?లను కూడా షేర్ చేశారు. ఈ క్రమంలో రాజా సింగ్ స్పందిస్తూ.. తనను చంపుతామని పదే పదే హెచ్చరిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని.. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు వచ్చిన బెదిరింపు కాల్స్ గురించి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు, తెలంగాణ డీజీపీ రవిగుప్తాకు లేఖ రాసినట్లు వివరించారు.ఎమ్మెల్యేలకు బెదిరింపు కాల్స్ వచ్చాయని చెప్పినా పోలీసులు పట్టించుకోలేదని గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ తెలపారు. ఫోన్ చేసి బెదిరించినవాళ్లు తన వద్ద ఎన్ని నంబర్లు ఉన్నాయని అడిగినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తనవద్ద మరో నంబర్ కూడా ఉందని సీఎం రేవంత్ రెడ్డి నంబర్ ఇచ్చినట్లు చెప్పారు. తనకు వచ్చినట్లు సీఎం రేవంత్ రెడ్డికి బెదిరింపు కాల్స్ వస్తే ఆ దుండగులపై స్పందిస్తారా లేదా అన్న విషయంలోనే సీఎం నంబర్ ఇచ్చినట్లు స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డికి బెదిరింపు కాల్స్ వెళ్తే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై యాక్షన్ తీసుకుంటారనే ఉద్దేశంతో సీఎం నంబర్ ఇచ్చానని తెలిపారు. ధర్మం కోసం పనిచేస్తే తనను, తన ఫ్యామిలీని చంపేస్తామని బెదిరిస్తున్నట్లు ఈ సందర్భంగా చెప్పారు.

## నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్

**-ఎస్ఐ నాగేంద్రప్రసాద్**



**టీ మీడియా,మే30, మహానంది:** నేరాల నియంత్రణకు కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం మహానంది మండలం గాజులపల్లె గ్రామ పరిధిలోని బుచ్చమ్మ తోపు యందు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా, ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, ముందస్తు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో యువత నాటు సారా, మద్యం, గుట్కా వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు అతి వేగంగా, అజాగ్రత్తగా నడపవద్దని కోరారు. వీటితో కలిగే ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని, డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికితే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా ఉంటుందన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, ఒకవేళ ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లోకి అనుమానిత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు రామకృష్ణ, బాలచంద్రుడు, హెడ్ కానిస్టేబుళ్లు ప్రసాద్ ,రామ్మోహన్, ఓబులేష్, కానిస్టేబుళ్లు శేఖర్, శేషు తదితరులు పాల్గొన్నారు.

## యువకుడు తో కల్సి వివాహిత ఆత్మ హత్య



**టి మీడియా,మే 30,మిర్యాలగూడ :** నల్గొండ జిల్లా మిర్యాలగూడ లో దారుణం చోటుచేసుకుంది. మిర్యాలగూడ రైల్వే స్టేషన్ పరిధిలోని మిర్యాలగూడ కుక్కడం మధ్యలో ఉన్న ఐలాపురం రైల్వే ట్రాక్ పై వివాహిత ,యువకుడు కలిసి గూడ్స్ రైలు కింద పడి అత్మహత్య చేసుకున్నారు. స్థానికులు బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం పరిధిలో దుర్గా నగర్ కు చెందిన ఆర్ .ధనలక్ష్మి (22), జి.దుర్గాప్రసాద్ (19) లు గురువారం ఉదయం గూడ్స్ రైలుకు ఎదురుగా వెళ్ళి ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీంతో ఇరు కుటుంబాలలో తీవ్ర విషాదం నెలకొంది. అయితే ధనలక్ష్మి ,దుర్గాప్రసాద్ లు గత కొన్ని రోజుల నుంచి వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారు. సంబంధం వల్ల భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో గత మూడు రోజుల క్రితం భర్త ను వదిలి తన పుట్టినిల్లు వెంకటాద్రిపాలెం కు వెళ్ళింది. బుధవారం ఇద్దరు కలిసి ఊరి నుంచి వెళ్లిపోయి గురువారం ఆత్మహత్య చేసుకున్నారు. వివాహిత మహిళ ధనలక్ష్మి కనబడటం లేదని భర్త రవికాంత్ మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ లో బుధవారం ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు చేసిన మరుసటి రోజే భార్య ఆత్మహత్య చేసుకోవడంతో బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు మృతి చెందడంతో ఆయా కుటుంబ సభ్యులతో హాస్పిటల్ లో రోదనలు మిన్నంటాయి. మృతురాలికి భార్గవ్(4) ,భావాని(3) పిల్లలు ఉన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు రైల్వే ఎస్ ఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు.

## సార్వత్రిక ఎన్నికలకు ముందే బ్రిటన్ పార్లమెంట్ రద్దు



**టీ మీడియా, మే 30, బ్రిటన్ :** బ్రిటన్‌లో త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. జులై 4న ముందస్తు ఎన్నికలకు వెళ్లనున్నట్లు ఆ దేశ ప్రధాన మంత్రి రిషి సునాక్ ఇటీవలే ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఎన్నికలకు ముందు బ్రిటన్ పార్లమెంట్ రద్దైంది. ఎన్నికల షెడ్యూల్‌కు అనుగుణంగా పార్లమెంట్‌ను గురువారం రద్దు చేశారు. ఇక బ్రిటన్ పార్లమెంట్‌లో మొత్తం 650 మంది సభ్యులు ఉన్న విషయం తెలిసిందే. పార్లమెంట్ రద్దుతో ఐదు వారాల ఎన్నికల ప్రచారం నేటి నుంచి అధికారికంగా ప్రారంభమైంది. జులై 4న బ్రిటన్‌లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. గత 14 ఏళ్లుగా బ్రిటన్‌లో కన్జర్వేటివ్ పార్టీ అధికారంలో ఉంది. రెండేళ్ల క్రితం ఆ దేశ ప్రధానిగా భారత సంతతికి చెందిన రిషి సునాక్ బాధ్యతలు చేపట్టి చరిత్ర సృష్టించారు. అయితే, ప్రధానిగా సునాక్ తీసుకున్న నిర్ణయాలపై సొంత పార్టీ నేతల నుంచే విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు జరగబోయే ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. ఈ ఎన్నికల్లో అధికార కన్జర్వేటివ్ పార్టీకి ఓటమి ఖాయమంటూ అత్యధిక ఒపీనియన్ పోల్స్ అంచనా వేస్తున్నాయి. ఈ ఎన్నికల్లో విపక్ష లేబర్ పార్టీ మెరుగైన ఫలితాలు సాధిస్తుందని అంచనాలు వెలువడుతున్నాయి.ఈనెల 23న ప్రధాని అధికారిక నివాసం '10 డౌనింగ్ స్ట్రీట్' వద్ద వర్షంలో తడుస్తూనే సునాక్ ఎన్నికల తేదీలపై ప్రకటన చేశారు. 'బ్రిటన్ ప్రజలు తమ భవిష్యత్తు ఎలా ఉండాలో ఎంచుకునే సమయం వచ్చింది. ఆర్థిక మంత్రిగా, ప్రధానమంత్రిగా ఎన్నో విజయాలను సాధించాం. దేశ ప్రజల రక్షణ కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని మీకు హామీ ఇస్తున్నా. దేశాధినేత కింగ్ చార్లెస్ తో మాట్లాడాను. పార్లమెంట్‌ను రద్దు చేయమని అభ్యర్థించాను. ఇందుకు రాజు కూడా అనుమతించారు. జూలై 4న దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి' అని రిషి సునాక్ వెల్లడించారు.

## నేడు తిరుమలాయపాలెం మండలంలో మంత్రి పొంగులేటి పర్యటన




**టి మీడియా,మే 30,ఖమ్మం :** తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తిరుమలాయపాలెం మండలంలో శుక్రవారం పర్యటించనున్నారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా మండలంలోని కొక్కిరేణి, ఎర్రగడ్డ, గోపాలపురం, తిమ్మక్కపేట, తాళ్లచెర్వు, బీరోలు, ఏలువారి గూడెం, బంధంపల్లి, బచ్చోడుతండా, సోలిపురం, రాజారామ్, పైనంపల్లి, జూపెడ, కాకరవాయి, సుద్దవాగుతండా, ముజాహిద్ పురం , ఏనుకుంట తండా, మంగళిబండతండా, రఘునాథపాలెం గ్రామాల్లో పర్యటిస్తారని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు నేరుగా మంత్రిని కలిసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చని దయాకర్ రెడ్డి తెలిపారు.

## ప్రేమించలేదని యువతి గొంతు కోసిన యువకుడు

**టీ మీడియా, మే 30,ఏలూరు :** ప్రేమిస్తున్నానని వెంటపడి యువతని ఆమె ఇంటి సమీపంలోనే హతమార్చి తాను కూడా ఆత్మహత్యాయత్నానికి యువకుడు పాల్పడిన ఘటన ఏలూరు నగరంలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఏలూరు నగరంలోని ఎమ్మార్సీ కాలనీకి చెందిన జక్కుల రత్న గ్రేస్ (22) స్థానికంగా తల్లిదండ్రులతో కలిసి జీవిస్తుంది. తొట్టి బోయిన ఏసురత్నం (23) అనే యువకుడు ఆమె వెంట గత కొంతకాలంగా ప్రేమిస్తున్నాడని వెంటపడుతున్నట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం యువతీ ఇంటి సమీపంలో ఉండగా అతను తన వెంట తెచ్చుకున్న కత్తితో పలుమార్లు మెడపై దాడి చేశాడు ఈ ఘటనలో యువతీ అక్కడికక్కడే మృతి చెందింది. వెంటనే ఏసు రత్నం కూడా అదే కత్తితో ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని అతన్ని చికిత్స నిమిత్తం ఏలూరులోని సర్వ జనాస్పత్రిక తరలించారు. మెరుగైన వైద్యం కోసం యువకుడిని విజయవాడ తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## అపార్ట్‌మెంట్‌లో భారీ అగ్నిప్రమాదం



**టీ మీడియా, మే 30,లక్నో :** ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా నగరంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో గురువారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. నోయిడాలోని సెక్టార్ 100లోని లోటస్ బౌలేవార్డ్ సొసైటీలోని ఓ ఫ్లాట్‌లో గురువారం ఉదయం మంటలు చెలరేగాయి. దీంతో అగ్నిమాపక సిబ్బందిత ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఫ్లాట్‌లో ఎయిర్ కండీషనర్ పేలడం వల్ల మంటలు చెలరేగాయని అగ్నిమాపక అధికారులు భావిస్తున్నారు. అయితే ఈ ఘటనలో ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.

## మహానందీశ్వని హుండీ ఆదాయం రూ.66,46,లక్షలు

**-ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి**




**టీ మీడియా, మే30, మహానంది:** మహానంది పుణ్యక్షేత్రంలో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ లెక్కింపు నిర్వహించగా దేవస్థానానికి రూ.66,46,755 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.గురువారం ప్రధాన ఆలయాల్లో భక్తులు 65 రోజులపాటు సమర్పించిన హుండీ కానుకలను ఆలయ ప్రాంగణంలోని అభిషేక మండపంలో సిబ్బందితో లెక్కించామన్నారు. ఇందులో స్వామి, అమ్మవారి ఆలయాలలోని హుండీలతోపాటు ఇతర హుండీలను లెక్కింపు నిర్వహించగా రూ.66,46,755 లక్షలు వచ్చిందన్నారు. ఆలయాల ద్వారా రూ.65,46,755 అన్న ప్రసాదం హుండీ ద్వారా రూ.94,915 గోసంరక్షణ ద్వారా రూ.35,644 వేలు, అలాగే యూఎస్ఏ 10 ధీరం, 1,యూఎస్ఏ 10 డాలర్, 1, యూఎస్ఏ 1 డాలర్ ,2 ,నేపాల్ 10 ,1 ,నేపాల్ 50 , 1,వచ్చినట్లు ఈవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖా తరుపున వెలుగోడు గ్రూప్ దేవాలయముల ఈవో వి. జనార్ధన్, మహానంది దేవస్థానం ఏఈవోలు వై .మధు, ఓ. వెంకటేశ్వరుడు, టెంపుల్ ఇన్స్పెక్టర్లు రాజు ,శశిధర్ రెడ్డి, ఆలయ అర్చకులు, సిబ్బంది, ఏజెన్సీ వర్కర్స్, భ్రమరాంబిక సేవా సమితి సేవకులు, శ్రీ కృష్ణ దత్త సాయి సేవా సమితి సేవకులు, తదితరులు పాల్గొన్నారు.

## వైద్యుల నిర్లక్ష్యంతో పసికందు మృతి



**టీ మీడియా, మే 30, వనపర్తి బ్యూరో :** నాగర్ కర్నూల్ జనరల్ ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యం మరోసారి బయటపడింది. పురిటి నొప్పులతో ప్రసవం కోసం వచ్చిన గర్భిణిని వ ట్టిం చ ు కో క పో వ డ ం తో బాత్రూంలోనే బిడ్డకు జన్మనివ్వడంతో అప్పుడే పుట్టిన బిడ్డ మృత్యువాత పడింది. ఈ ఘటన బుధవారం ఉదయం చోటు చేసుకుంది. బాధితుడు ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం. నాగర్ కర్నూల్ జిల్లా తాడూరు మండలం అల్లాపూర్ గ్రామానికి చెందిన మహేశ్వరి(26) మూడో కాన్పు పురిటి నొప్పులతో బాధపడుతూ గురువారం ఐదున్నర గంటల ప్రాంతంలో 108 సహాయంతో జిల్లా ఆస్పత్రిలో చేరింది. కానీ వైద్యులు నిర్లక్ష్యంగా తనను పట్టించుకోకపోవడంతో పురిటి నొప్పులు మరింత అధికమయ్యాయి. బాత్రూం కి ఒంటరిగానే పంపడంతో ఆ గర్భిణీ అక్కడే ప్రసవించింది. పుట్టిన బిడ్డ పరిస్థితి విషమించడంతో వెంటనే పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు.

## గ్రామానికి త్రాగునీటి సమస్య తీర్చిన ౨ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి



**టీ మీడియా, మే 30, వనపర్తి బ్యూరో :** వనపర్తి నియోజకవర్గం వనపర్తి మండలం కడుకుంట్ల గ్రామ బీసీ కాలనీలో ఎంతో కాలంగా గ్రామ ప్రజలు నేటి సమస్యతో ఎదుర్కొంటున్నారు. మండల అధ్యక్షులు రవి కిరణ్ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ఎమ్మెల్యే వెంటనే స్పందిస్తూ గ్రామంలో రెండు బోర్లు వేయించడం జరిగింది. 1, వ బోరు హైస్కూల్ వెనకాల. 2, వ బోరు పోచమ్మ గుడి వెనకాల వేయడం జరిగింది. 1, బోరు రెండున్నర ఇంచులు నీరు రావడం జరిగింది 2 వ బోరు 3 ఈంచుల నీరు రావడం జరిగింది. గ్రామంలో నీటి సమస్య తీరడంతో ఎమ్మెల్యే మేఘా రెడ్డి కి గ్రామ కాంగ్రెస్ కమిటీకి గ్రామస్తులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియ జేయడం జరిగింది.

## విత్తనవిక్రయాలు వేగవంతం

**-జిల్లా కలెక్టర్ విపి గౌతమ్**




**టి మీడియా,మే 30,ఖమ్మం:** విత్తన పరీక్షల్లో వేగం పెంచి, విత్తన విక్రయాలకు త్వరితగతిన చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ తెలిపారు. గురువారం కలెక్టర్, రఘునాథపాలెం లోని భూసార పరీక్షా కేంద్రం సందర్శించి, విత్తన తనిఖీల ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. విత్తనాలు జిల్లాకు చేరగానే, సంబంధిత పరీక్షలు చేపట్టి, శాంపిల్ ఇచ్చిన 4 రోజుల్లోనే నివేదిక ఇవ్వాలన్నారు. పరీక్షల్లో జాప్యం జరిగితే, విత్తనాలు రైతులకు అందడంలో ఆలస్యం అవుతుందని ఆయన తెలిపారు.

అనంతరం కలెక్టర్, రఘునాథపాలెం పీఏసిఎస్ సందర్శించి, అక్కడ ఉన్న రైతులతో సంభాషించారు. ఏ పంట సాగు, విత్తనాల సబ్సిడీ, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. మిర్చి, పత్తి, వరి సాగుచేస్తున్నట్లు, సమస్యలు లేవని రైతులు కలెక్టర్ తో అన్నారు. కలెక్టర్, రైతులకు జీలుగ విత్తనాల పంపిణీ చేశారు.

అనంతరం రఘునాథపాలెం లోని జై కిసాన్ విత్తన షాపును కలెక్టర్ తనిఖీ చేశారు. పత్తి విత్తనాల ప్యాకెట్ల గ్రోత్ టెస్ట్, ఇన్వాయిస్, షాపు లైసెన్స్, స్టాక్ రిజిస్టర్, రైతుల రిజిస్టర్, స్టాక్ బోర్డ్ లను తనిఖీలు చేశారు. స్టాక్ వివరాలు బోర్డుపై ప్రదర్శించాలని, రైతులకు విత్తనాల లభ్యతపై అవగాహన కల్పించాలని అన్నారు. ఒకే రకమైన విత్తనాలు కొనకుండా, అన్ని రకాల విత్తనాలు ఒకే దిగుబడి ఇస్తాయని రైతుల్లో చైతన్యం తేవాలన్నారు. అధికారులు విత్తనాల నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. విత్తన రాయితీలపై రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ పర్యటన సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల, వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారులు తదితరులు ఉన్నారు.

## కేరళలోకి ప్రవేశించిన రుతుపవనాలు

**-మరో 2 రోజుల్లోనే ఏపీకి ఆగమనం**



**టి,మీడియా, మే30,న్యూఢిల్లీ:** ఈ ఏడాది మండుటెండలకు ప్రజలు బెంబేలెత్తిపోయారు. మునుపటి కంటే తీవ్ర స్థాయిలో భానుడు ప్రతాపం చూపాడంతో ప్రజలతోపాటు మూగజీవాలు కూడా అల్లాడిపోయాయి. తాజాగా వాతావరణ శాఖ వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగించే చల్లని కబురు వినిపించింది. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న రుతుపవనాలు ఈ రోజు కేరళలో అడుగుపెట్టాయి. రుతుపవనాలు గురువారం ఉదయం కేరళను తాకినట్లు ఐఎండీ అధికారికంగా వెల్లడించింది. దీంతో ఆ రాష్ట్రంలోని 14 జిల్లాల్లో ఎల్లో అలర్ట్ జారీ చేశారు. పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ మీదుగా వీచిన రెమల్ తుఫాను రుతుపవన ప్రవాహాన్ని బంగాళాఖాతం వైపు మళ్లించిందని, దీని ప్రభావంతో రుతుపవనాలు కేరళలో ప్రవేశించినట్లు పేర్కొంది.కేరళతోపాటు లక్షద్వీప్‌లో రుతుపవనాలు విస్తరించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ నేపథ్యంలో కేరళలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. 64.5 ఎంఎం నుంచి 115.5 ఎంఎం మధ్య వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉన్నట్లు ఐఎంబీ వెల్లడించింది. కాగా ఇప్పటికే కేరళలో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాబోయే మూడు, నాలుగు రోజుల్లో రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్లోకి ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.